ఆ రోజు మేం అందరం అడ్డుగా వున్న ముళ్ళ తీగెలను పట్టు కొని నిలబడ్డాం. ఆ ముళ్ళ తీగెలు దాటి మేం పోగలిగితేగా. చుట్టూ వార్డర్ల దట్టమైన కాపలా వుంది. ఒకవేళ తీగెలు తెంచగలిగినా వాళ్ళను తప్పించుకుని పారి పోవటం అసంభవం. మేం అంతులేని ఆవేశంతో వూగి పోతున్నాం. వుడికి పోతున్నాం. ప్రయోజనం శూన్యం, అసహాయులం.

ఆ తీగెల కావల, వార్డర్ల కాపలా కవతల, ఎత్తయిన గోడవెనుక భాగం నుండి గట్టిగా పలికిన నినాదం ఒకటిమాకు విన్పించింది. "వందేమాతరం—వందే మాతరం" గోపాలక్రిష్ణను కొరడాతో కొడుతున్నారు. ప్రతికొరడా దెబ్బకూ అతను "వందేమాతరం" అంటూ నినా దాలు పలుకుతున్నాడు. అలా ఏడు దెబ్బలు తిన్న తరువాత అతని స్వరం క్షీణించింది. కొరడా దెబ్బల వురవడి కూడా తగ్గింది. బహుశా అతను స్పృహ తప్పి పడిపోయి వుండవచ్చు.

1942 సం॥ము నాటి విషయం యిది. ఎన్నో సంవత్సరాలు కాలగమనంలోకలసి పోయాయి. అయినా ఆ సంఘటనతాలూకు జ్ఞాపకాలు నాకు నిన్న మొన్ననే జరిగి నట్లనిపిస్తాయి.

ఆ రోజుల్లో మిగతా సత్యాగ్రహులు గూడ అసాధారణమైన సాహసాన్ని, అనన్య వీరత్వాన్ని చూపించారు. అపూర్వ సహనాన్ని గూడ ప్రదర్శించారు. కాని ఆ మిగతావారితో నాకు వ్యక్తిగతంగా అంత పరిచయం లేదు. గోపాలక్రిష్ణతో నా కున్న సన్నిహిత సంబంధం మిగతా వారితో లేదుగదా.

అతను నా స్నేహితుడు—ప్రస్తుతం మేం వేరైనా మనుకోండి వూ( కాని ఆ రోజుల్లో అతనికంటె మంచి సన్ని హితుడు స్నేహితుడు నాకు మరెవ్వరూ లేరు. ఇప్పుడు మా మార్గాలు వేరు కావచ్చు.

# వందే భగవతి

మూలం: ఆరిగపూడి

అనువాదం: హైమవతీదేవి





కాని "భారతదేశాన్ని వదలండి" అనే ఆందోళన జరిపే ఆ రోజుల్లో మా యిద్దరి పథం ఒక్కటే. అది జైలు నాల్గు గోడల మధ్యనే అంత మొందింది గూడ.

జైలుకు వెళ్లే ముందు ఆరుమాసాల క్రితమే నేను అతని పెళ్ళికి వెళ్లాను. సిగ్గు దొంతరలతో కళకళ లాడుతున్న అతని నూతన వధువు ముఖం నాకీ రోజుకూ కళ్ళకు గట్టినట్లుగానే వుంటుంది. ఇద్దరూ ఒంటొరులను పువ్వుల దండలతో నింపు కున్నారు. ఆ దృశ్యం కన్నుల పండువగా వుంది. ఇరువురూ కళ్యాణ మంటపంలో శాశ్వతంగా చేరువైన మధురమైన శుభ సన్నివేశం అది

గోపాలక్రిష్ణ దృఢకాయుడు, పచ్చని ఛాయ, ముఖంలో కొట్టవచ్చినట్లు కన్పించే గాంభీర్యం, దానికి తగ్గట్టు మెరుగులు దిద్దిన యౌవనశోభ. అవును అదే

శరీరం మీద కొరడా దెబ్బలు, రక్తస్రవం తులు, గాయాలు. అబ్బ. గత స్మృతులను జ్ఞాపకం తెచ్చేలా మాసీ మాయని మచ్చలు.

వాడు నా తరువాత జైలుకు వచ్చాడు. నేను చేస్తూ పట్టుబడిన పనే అతనూ చేస్తూ పట్టు పడ్డాడు. అంటే పోలీస్ స్టేషన్ల మీద దాడిచేయడం. ఆ స్థానాల్లో నుండి తుపాకులూ అవీ దొంగిలించిన కారణంగా నా మీద ఆరోపించిన నేరాలే అతని మీద ఆరోపించారు. కాని శిక్ష మాత్రం మా యిద్దరికీ వేరు. ఎందుకంటే మా యిద్దరి న్యాయాధికార్లు ఒక్కరుగారు. "చట్టం గుడ్డిది" అంటారు కొందరు. దీనికి మంచి బలవత్తరమైన వుదాహరణ గోపాలక్రిష్ణ. అతనికి రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు 16 కొరడాదెబ్బలు పడ్డాయి. నా కవేవీ లేవు మరి. ఆ శిక్ష నాకు విధించినట్లయితే అతను సహించినంత ధైర్యంగా నేను సహించ గలిగేవాడినో లేదో అతడిలా నేను బలవంతుడినీగాను. అతనిలా పూల పాన్పుల మీద పవళించి దర్జాగా పెరగనూ లేదు. కష్టాలు నా కలవాటే. అతను ఒక గొప్పింటి ఏకైక పుత్రుడు.

అతని తలిదండ్రులు, వాడిని ఒక మామూలు స్కూలుకు పంపించి ప్రాపంచిక వాస్తవికతలు తెలియ చెప్పాలనుకున్నారు. నాకు ఆ స్కూలుకు వెళ్ళడం అంటేనే గొప్ప అదృష్టం అన్న మాట. నా దృష్టిలో అది ఒక పెద్ద వరం.అక్కడే మా స్నేహం ఆరంభమయింది. ఆస్తి పాస్తుల అడ్డు గోడలున్నప్పటికీ ఆ మా స్నేహం అనన్యమైంది. అటువంటి గొప్ప గౌరవనీయ కుటుంబానికి చెందిన సున్నితమైన ఆ సుందర నవయౌవనునికి కొరడా దెబ్బలు శిక్షగా విధించారు. గోపాలక్రిష్ణ తన తలిదండ్రులను ఈ శిక్ష గురించి ఏ అప్పీలు చెయ్యనీయలేదు. కోర్టులో తనను తాను రక్షించుకునేందుకు ప్రయత్నించనూ లేదు. చివరకు వకీళ్ళను గూడ నోరెత్తనీయలేదు. తనకు శిక్ష విధించిన ఆ ప్రభుత్వాన్ని అతను ఒక ప్రభుత్వంగా భావించ లేదు.

నే నెంతమంది సత్యాగ్రహులనో చూశాను. నేను వారిలో ఒకడిగా ఉన్నాను. అయితే గోపాలక్రిష్ణలాటి వాడిని మాత్రం చూడలేదు నేను. కాని—అతను అలా ఎందుకు చేశాడు అని ఆలోచిస్తే నాకెంతో ఆశ్చర్యం గల్గుతుంది. అతనెందుకు అమర జీవికాలేదు? అమరత్వం పొందబోయే అతడి కాళ్ళు అలా ఎందుకు వణికి పోయాయి? అతను అలా ఎందుకు వెనుదీశాడు? "వందేమాతరం" అనే పవిత్రమైన నినాదాన్ని పావన గంగానదిలా స్రవింప చేసిన అతని కంఠం నుండి మరో మాట ఎలా వెలువడింది? ఏమిటో..


శిక్ష విధించిన తరువాత అతడిని జైలు హాస్పిటలుకు పంపించారు. వార్డర్లను నెమ్మదిగా కాకాబట్టి ఎలాగో అతనిని చూద్దామని

వెళ్ళాను. వీపు మీద తోలంతా వొలిచినట్లుగా వుంది. రక్తసిక్తమైన మాంసం మీద కొరడా దెబ్బలు చారల్లా తేలాయి. చాల బాధ గలుగుతూ వుండవచ్చు. అయినా అతడు మూలగనుగూడ మూలగడం లేదు. ముఖంలో బాధా భరితమైన ఒక వింత చిరునవ్వు మాత్రం కనిపిస్తూంది

నేను అతడితో ఏం మాట్లాడేది, ఏమని పరామర్శించేది. కళ్లు పెద్దవిచేసి చూడడం తప్ప అతడిలో శక్తి ఎక్కడా వున్నట్లనిపించడంలేదు. ముఖం మొద్దుబారిపోయింది తనకు భరించరాని బాధ కలుగుతుందనే విషయం ఎదటి వారికి అసలు తెలియగూడదని అతని భావన. అప్పుడు అతను స్పృహలోనే వున్నా ఒక రకమైన నిస్పృహ అతన్ని ఆవరించింది. భయంకరమైన బాధను భరిస్తున్నాడు. సరిగా మూల్గను గూడ లేని అతనినోటి నుండి మాటలెలా పెగులుతాయి? ఒక్క క్షణం నా వైపు చూసి మరోవైపుకు తల తిప్పేసుకున్నాడు.

కరడు గట్టి రక్తం లేని ముకుళించిన అతని ఆ మోము, ఆ పెద్ద పెద్ద కళ్ళు, అమాయకమైన చూపులు నేటికి గూడ నన్ను వెంటాడుతున్నట్లే వుంటాయి, "ఆదర్శం" ఆదర్శమే అయినా మానవత్వం అనే శక్తి గూడ వొకటి వుంది. బలవంతులలో గూడ కొన్ని బలహీనతలుంటాయి. స్వభావసిద్ధమైన, మానవ సహజమైన, దాన్ని అసలు బలహీనత అనడమేమిటి" అని అతను అన్నట్లే అనిపిస్తుంది నాకు.

. జైల్లో ప్రతివాడూ గోపాలక్రిష్ణ గురించే మాట్లాడు తున్నాడు. అందరూ అతనిని వేనోళ్ళ పొగడు తున్నారు. అతని




ధైర్య సాహసాలకు, సహనతకు. గాంభీర్యానికీ అందరూ అచ్చెరు వొందారు. జైలు సహచరులు చాటు మాటుగా ఈ వార్తలను పత్రికలవారికి గూడ అందచేశారు దేశం నలుమూలలా అతని ప్రస్తావన వింటుంటే నేను చేయలేక పోయిన త్యాగాన్ని, నేను చూపలేక పోయిన సాహసాన్ని సంతోషంగా నా స్నేహితుడైనా చూపాడు గదా అనే తృప్తి, ఆనందం నాలో గల్గాయి. నా దృష్టిలో అప్పుడు అతను ఒక మామూలు స్నేహితుడిగా కాక గొప్ప ఆదర్శ వ్యక్తిగా నిలిచి పోయాడు. కాని॰

అతని తలిదండ్రులు. భార్య వచ్చారు. వాళ్లు జైలు గేటు దగ్గర వచ్చి వున్నారని తెలిపారు. గోపాలకృష్ణను చూడటానికి వాళ్లు జైలుసూపరిండెంటు అనుమతి కోసం ప్రయత్నిస్తున్నారు. గోపాలక్రిష్ణ వాళ్ళను చూడటానికి తన విముఖతను తెలియపర్చకపోయి నట్లయితే సూపరింటెండెంటు అనుమతించే వాడేనేమో— మానవత్వం కొంత అమానుషత్వం కొంత కలగలుపుగా వున్న గోపాలకృష్ణలోని ఈ వింత ప్రవర్తనలో గూడ ఘనత యిమిడి వుంది.

రెండు మూడు రోజుల తరువాత నాకు మళ్ళీ గోపాలక్రిష్ణను చూసే అవకాశం లభించింది. స్వయంగా వార్డరేవచ్చి నన్ను పిలుచుకుపోయాడు. నా కెంతో ఆశ్చర్యం వేసింది. సాధారణంగా జైళ్ళలో అలా జరుగదు.

హాస్పిటల్ వార్డులో కెళ్ళి చూశాను. తలగడల సహాయంతో తన బెడ్డుమీద కూర్చుని వున్నాడు గోపాలక్రిష్ణ, మొఖంలో ఏదో వింత చిరునవ్వు. ప్రక్కనే ఒక విదేశీ నవయువతి నిలబడివుంది. విదేశీ వస్త్రాలంకరణలో వున్న ఆమె వీపు మాత్రమే నాకు కన్పించింది. నా వుత్సుకత పెరిగింది. బెడ్ ప్రక్కగా వెళ్ళినప్పుడు ఆ యువతి నన్ను సాదరంగా నవ్వుతూ ఆహ్వానించింది. కాని ఆమె అసలు అక్కడ ఎందుకున్నట్లు॰ ఆమె మా జైలు సూపరిండెంటెంటు గారి గారాల బిడ్డ అప్పుడప్పుడూ మమ్మలను చూసేందుకు తండ్రితో బాటు జైలుకు వస్తూండేది. ఆమె రాగానే జైల్లో ఒకవింత వాతావరణం ఏర్పడేది. అణగిపోయి అదుగునపడ్డ మాలోని ఇంద్రియ వాంఛలు బుసలు కొడుతూ అందరిలోనూ పడగలు విప్పేవి రాజకీయ ఖైదీలందరూ ఆమెను చూసేందుకు కిటికీ చువ్వల వద్ద నిలబడేవారు. అలా ఆమె వారందరినీ దాటిపోయే వరకూ రెప్ప వాల్చకుండా గుటకలు మింగుతూ చూశేవారు. ఆమె చాల అందమైన స్త్రీ. ఆమెలో ఎంతో అకర్షణ. మనలను రెచ్చ గొట్టడానికే ఈ సూపరింటెండెంటు ఈ పిల్లను యిలా వెంట



తీసుకు వస్తున్నట్లున్నాడని మేం అందరం అనుకునే వాళ్ళం.

కాని ఈమె యిక్కడెందుకున్నట్లు? గోపాలక్రిష్ణను గూడ రెచ్చగొట్టే ప్రయత్నాలు జరగడం లేదుగదా?

సూపరింటెండెంటు కూతురు అయితే కావచ్చు. కాని ఈమె జైలు నియమాలకు విరుద్ధంగా ఒక రాజకీయ ఖైదీని చూసేందుకు అలా ఎలారాగలుగుతుంది?

అసలావిడ యిక్కడ ఎందుకున్నట్లు?

"ఈమె మిస్ హావు" అంటూ గోపాలక్రిష్ణ వినయంగా ఆమెను నాకు పరిచయం చేశాడు.

"అవునవును. ఈమె మన యింగ్లీషు సూపరింటెండెంటు కూతురు గదూ?"

"ఇంగ్లీషు వాళ్ళంగాదు. ఐరీషులం మేము." మందహాసంగా మాట్లాడింది మిస్. హావు.

"ఎర్రతోలు గల వాళ్ళందరూ మా దృష్టిలో ఇంగ్లీషు వాళ్ళే" అని మర్యాదను లెక్క చేయకుండా అన్నాను నేను.

"హుఁ హుఁ" ఆ యువతి అందమైన ఆ నవ్వు నన్ను చల్లపరచింది అంతలోనే నేనేదో తప్పు చేశాననే భావం నాలో తళుక్కుమంది.


"నేను నా తండ్రికి బిడ్డగా గాక మరేమీ కాను? 18 సంవత్సరాలు దాటిన దాన్ని నేను." ఆ స్త్రీ నవ్వులో నా కప్పుడు కొంత చిలిపితనంతో చింది. అదే చిలిపితనం రోజూ మమ్ములను దూరం నుండి పూరిస్తూ పోయేది మొదట్లో.

"వయస్సు దాచుకునే రహస్యం బహుశా స్త్రీలలో నడివయస్సులో వస్తుందనుకుంటాను మీ అసలు 18 సం॥ లు వున్నట్లుగా కూడ కన్పించడం లేదు."

ఈ మాట మొదటిసారిగా పరిచయమైన వాళ్ళతో మాట్లాడ్డం మర్యాద కాకపోయినా నా నోటినుండి వచ్చింది.

"అన్నట్లు—మీ స్నేహితుడికి కాస్త



నయమైనట్లే తలగడల సహాయంతో కాస్త కూర్చోగల్గుతున్నారు. అంతేగదూ మిష్టర్ గోపాలక్రిష్ణ?" ఆమె ఎంతో ప్రేమగా అతడిని చూస్తూ అడిగింది.

"అంతా మీ దయేగా" మిస్. హాపూ చల్లని చూపే లేకపోతే బహుశా నేను-" చెపుతూ చెపుతూ గోపాలక్రిష్ణ సంకోచించాడు.

"నేను నా కర్తవ్యాన్ని నిర్వర్తించాను. అంతే" అంది మిస హాపు

అందులోనూ మానవ సహజ మానవత్వాన్ని చూపడానికి వీలులేని ఈ చోటులో మీరు నాకు చేసినసేవ చాలగొప్పది. నేనెన్నటికీ మీ మేలు మరువలేను." ఆ నాడే అతడి గాయాలన్నీ దాదాపు మానిపోయాయనేది అతని మాటల్లో ధ్వనిస్తుంది కొరడా దెబ్బలు తగిలినప్పటినుండీ ఆవిడ వస్తూపోతూ వుందనీ, అతనికి అన్ని విధాలా పరిచర్యలు చేసేదనీ చెప్పాడు గోపాలక్రిష్ణ. తండ్రి కొరడా ఝళిపించాడు కూతురు గాయాలను మాన్పింది—చాల విచిత్రంగా లేదూ?

ఆందోళన యింకా జరుగుతూనే వుంది. మేము పోలీసులకు తెలియనీయకుండా ఎన్నో విషయాలు దాచి వుంచాం. సేవ చేస్తున్నాననే వంకతో మా రహస్యాలను సేకరించవచ్చిన ప్రభుత్వ గూఢచారిణిగాదు గదా ఒక వేళ ఈమె!

ఐరిషిది అయినా ఎర్రజాతికి చెందిందే పైగా ప్రభుత్వం క్రింద జీతగాడు తండ్రి. ఆ సూపరింటెండెంటు కూతురు ఆమె. ఒకవేళ గోపాలక్రిష్ణని తన వలలో వేసుకోవాలనుకుంటుందేమో.

నా మనస్సులో సందేహాల సుడిగుండాలు రేగుతూనే వున్నాయి. గోపాలక్రిష్ణ నా ఎదురుగా చిరునవ్వుతో పడుకుని

వున్నాడు. ఆ నవ్వులో ఏదో నిస్సహాయత నిశ్చింత, కృత్రిమత గోచరిస్తున్నాయి. మామూలు కుశల ప్రశ్నలు తప్ప మా మధ్య సంభాషణ అంటూ ఏమీ జరుగ లేదు.

అతని వద్ద వెళ్ళి వస్తానని సెలవు తీసుకుని వెళ్తూ వుంటే మిస్ హవ్వా, ట్రేలో అతనికోసం ఇంగ్లీషు భోజనం తీసుకెళుతూ వుంది. అది జైలు భోజనం మాత్రం గాదు. తప్పకుండా తన యింటి నుండే తెస్తూ వుండి వుండాల ఆమె—ఆ తర్వాత యిక అతనిని గురించి ఆలోచించలేక పోయాను—

ఆ తరువాత కొన్నాళ్ళకు జైలు హాస్పిటల్ వార్డు నుండి గోపాలక్రిష్ణ ఇంటికి వెళ్ళిపోయాడు. అతను ప్రభుత్వాన్ని క్షమార్పణ కోరాడని విన్నాం మేము. మాకు ఆశ్చర్యం ఆవేదనా గలిగాయి. అతని భార్య అతనిని స్వయంగా తీసుకెళ్ళడానికి జైలు ద్వారం వరకూ వచ్చిందనీ విన్నాం.

గోపాలక్రిష్ణ చేసిన ఈ పని మా కెంతో అవమానకరమైందిగా తోచింది. అంతగా భార్యను ప్రేమించేవాడు అసలు జైలు కెందుకు రావాలి? క్షమార్పణకోరి జైలునుండి పోదలచినవాడు "ఆదర్శ వాదిని-సత్యాగ్రహినీ" అంటూ ఆ నాటకం ఎందుకు?

ఫలితంగా మిస్. హవ్వా చాల అవమానం పొందింది. ఏదో గొప్ప దేశ భక్తునికి సేవచేస్తున్నానుగదా అనుకుంది ఆమె. కాని అతడు వొట్టి కాముకుడుగా మారాడు.

ఒకవేళ అప్పుడు నేనేదైనా నినాదం యివ్వగలిగితే యిచ్చే వాణ్ణి. "వందే భగవతీ" అని.

గోపాలక్రిష్ణ ఈ పతనానికి కారణం కొంతవరకూ తనేనని బహుశా మిస్. హవ్వాకు తెలిసి వుందనుకుంటాను

దేశప్రేమకంటె గూడ మించిన శక్తులు వేరే వున్నాయనీ. వాటికి చాలా బలం వుంటుందనీ వయస్సు మళ్లుతూన్న నేను యిప్పుడనుకుంటూ వుంటాను. అప్పుడు నాకంతగా తెలియలేదుగాని, నేడు వూహించగలను. దేశభక్తి అనే ఆదర్శం కంటె గూడ మించిన, ప్రకృతి సిద్ధమైన మరేదో బలమైన శక్తి అతని ఈ ప్రవర్తనలో వుందనుకుంటాను.

కాని తన ప్రేమ పూరితమైన ప్రవర్తనే. ఒక అవ్యక్తమైన పవిత్ర దేశభక్తి నుండి, గోపాలక్రిష్ణని వాస్తవిక పారివారిక జీవితం వైపు పురిగొల్పి మరల్చగలిగిందనేది పాపం మిస్. హవ్వాకు తెలిస్తేగా!

